# మొదటి రాత్రి



పి.ఎస్.నారాయణ

# మొదటిరాత్రి

పి. ఎస్. నారాయణ

## నవల

# మొదటిరాత్రి

## (నవల)

స్వాతి

సచిత్ర మాసపత్రిక

అక్టోబర్, 2008 సంచిక

అనుబంధ నవలగా

ప్రచురింపబడింది

ముఖచిత్రం: స్వాతి సౌజన్యంతో.

**వెల:రు. 100**


**:రచయిత చిరునామా:**

**పి.ఎస్.నారాయణ**

**8-3-168/20/బి/7,**

**సిద్ధార్థనగర్ నార్త్, ఏజీ కాలనీ దగ్గర,**

**హైదరాబాద్-500 038**

**ఫోన్ నం: 040-2371 3835/99483 19407**

Email; potturi_snarayana@yahoo.co.in

గమనిక

ఈ నవలలోని పాత్రలు, సంఘటనలు-
అన్నీ కల్పితాలు, ఎవర్నీ ఉద్దేశించినవి కావు.
ఎక్కడయినా పోలికలు, సామ్యాలూ
కనిపించినా అవి యాదృచ్ఛికమే.

-రచయిత

# మొదటిరాత్రి

శనివారం. రాత్రి పది గంటల పదిహేను నిముషాలు.

ఇంకా లగ్నానికి అరగంట సమయమున్నది.

చుట్టూ వున్న పచ్చటి చెట్లు చల్లటి గాలినిస్తూ వాళ్ళను సాదరంగా స్వాగతిస్తున్నట్లుగా తలలూపుతున్నయి.

ఆకాశంలో చంద్రుడి ధాటికి తట్టుకోలేనట్లుగా వెలాతెలాబోతున్న నక్షత్రాలు.

మారుతీ ఎస్టీమ్ ఏసీ ఆ చెట్లనడుమ, ఎత్తుగా వెదురు బద్దలతో అందంగా కట్టిన చిన్న పొదరింటి ముందు ఆగుతుంటే చెట్లక్రింద తారట్లాడుతున్న నెమళ్ళు భయంతో గుబుర్లలోకి పారిపోయిన వైనాన్ని చూచి వైదేహి తన పెద్ద కళ్ళను మరింత విశాలం చేసుకొని వాటివంకే చూస్తోంది.

పట్నవాసంలో, కాంక్రీట్ జంగిల్‌లో పెరిగేవాళ్ళకు ఇలాంటి తోటల అందం వింత అనుభూతే.

తెల్ల డ్రెస్‌లో వున్న డ్రైవర్ వడివడిగా దిగి వెనుక తలుపు తెరిచాడు.

ముందు జయంత్, వెనగ్గా వైదేహీ దిగి ఆ తోటవంకే పరీక్షగా చూస్తూ నిలుచున్నారు.

ఒక్క నిముషం తరువాత జయంత్ జేబులో పర్స్ తీసి, అందులోనుంచి వందరూపాయలనోటు తీసి, డ్రైవర్‌కు ఇస్తూ, "మళ్ళా నాలుగోరోజు ఉదయం ఏడు గంటలవరకూ కనబడకు!" అన్నాడు నవ్వుతూ.

అతడు ముసిముసి నవ్వులతో, నమస్కారంపెట్టి, స్టీరింగ్ ముందుకూర్చొని రంయ్‌న

కారును వెనక్కు తిప్పుకొని వెళ్ళిపోయాడు. ఎన్ని కారులు మారినా తన చిన్నప్పటినుంచీ అతడే తన కారు డ్రయివర్!

నలువైపులా మరోసారి పరీక్షగా చూశాడు జయంత్. వైదేహి అతడు చూస్తున్న వైపే తనూ చూస్తూ పక్కగా అతడిని ఆనుకు నిలుచున్నది.

ఎదురుగ్గా నాలుగు టేకు చెట్లను కలిపి, మంచెలా తయారుచేశారు. దానిమీద కట్టిన వెదురుబద్దల గదికి వివిధ రకాల పూలతీగలు అల్లుకున్నాయి.

పక్కకు తిరిగి వైదేహి ముఖంలోకి ఆప్యాయంగా చూశాడు. ప్రేమగా చూశాడు. కాంక్షగా చూశాడు. ఆమె సిగ్గుతో తల వంచుకున్నది అతడి చూపుల్ని అర్థం చేసుకున్న దానిలా.

“అక్కడ వున్న కొయ్య నిచ్చెన చూడు... ఆ నిచ్చెనకూ, దాని మెట్లకూ కట్టిన పూలు మనకు ఎంత ఆహ్లాదం కలిగిస్తాయో, మనిద్దరం ఒకటయ్యే ఈ క్షణంనుండి మన జీవితం అంత అహ్లాదంగా గడిచిపోవాలి!” అన్నాడు ఆమెవంకే తాదాప్యంగా చూస్తూ.

అది వాళ్ళ వివాహమయిన మూడోరోజు... పచ్చని గడ్డిమీద అడుగులు వేసుకుంటూ నిచ్చెనదాకా వచ్చారు.

“చెప్పులు లేకుండా చల్లటి ఈ గడ్డిమీద నడిస్తే గిలిగింతలు పెట్టినట్లుంటుంది!” వైదేహి అన్నది చిరునవ్వుతో.

“ఏ ముల్లో గుచ్చుకున్నదంటే ఈరాత్రి మన ఆనందమంతా గోవిందా!... అందునా ఆడవారి పాదాలు అతి సున్నితమాయే!” అన్నాడు జయంత్ పెద్దగా నవ్వి.

పక్కన దూరంగా ఒక లేడి చెట్ల మధ్య ఎగురుతోంది. చెట్లమీద పక్షుల కిలకిలారావాలు... అక్కడక్కడా వెలుగుతున్న దీపాలు... నిచ్చెన దగ్గర ‘చెప్పులు క్రిందనే విడవండి’ అనే సూచన రాసివున్న బోర్డు...

“దాన్ని ఎక్కాలి మనం ఇప్పుడు!” అన్నాడు భార్య ముఖంలోకి చూస్తూ.

“భయపడుతున్నారా?”

“కాదోయ్... మన ఆనందాన్ని అంత ఎత్తుకు తీసుకు వెళ్ళాలని!” అన్నాడు భార్య చేతి వేలుని తన వేలుకు మెలిక వేసి, ఆమె నడుంచుట్టూ చేయి వేసి దగ్గరకు లాక్కున్నాడు. ఎవరైనా చూస్తున్నారేమో నన్నట్లుగా కలవరపడుతూ తలెత్తి నలువైపులా చూచింది వైదేహి ముఖమంతా ఎఱ్రబడగా.

దోసిళ్ళతో ఎత్తుకోవచ్చున్నట్లుగా కురుస్తున్న వెన్నెలే ఆమెను గిలిగింతలు పెడుతోంది. ఆపైన పక్కన జయంత్...

“ఇక్కడున్నది మనమిద్దరమే... ఈ స్వర్గవనంలో మనం ఏంచేసినా గమనించే నాధుడు లేడు... మెయిన్ గేట్‌నుంచి పావు కిలోమీటర్ దూరంలో వున్నాం ... మనం ఏకాంతంలో దేవలోకాన్ని సృష్టించుకోవాలి!”

ఆమె పెదవులు విచ్చీవిచ్చకుండా నవ్వింది.

“ఆపైనున్న పూల పందిరిలో మనం గంధర్వులమే అవాలి!” అన్నాడు. “ముందు నువ్వెక్కు... నీ వెనగ్గా నేను నువ్వు భయపడకుండా నీ నడుం పట్టుకొని ఎక్కుతాను!”

“మీకు భయమైతే చెప్పండి... నేనే ఆపని చేస్తాను!” అన్నది ముసిముసి నవ్వులతో భర్త ముఖంలోకి కొంటెగా చూస్తూ.

భార్య వంక గర్వంగా చూశాడు జయంత్. “దట్స్ గుడ్... అందుకే నువ్వంటే నాకంత ఇష్టమేర్పడింది మొదటి చూపులోనే!”

“నా ధైర్యం సంగతి మీకేం తెలుసు... మా కో ఎడ్యుకేషన్ కాలేజీ ఎన్నికల్లో రెండేళ్ళు నేను కల్చరల్ సెక్రటరీగా అత్యధిక మెజారిటీతో నెగ్గాను పెద్దపెద్ద తలకాయలనే ఓడించి... నా ధైర్యమే నన్ను గెలిపించింది!” అంటూనే ఆ నిచ్చెనమీద కాలుపెట్టింది. “మీరు మాత్రం నా అందం చూసే ఎన్నుకున్నారు!”

అక్కడ వాళ్ళకు ఆ రాత్రి శోభనం ఏర్పాటు చేశారు!

ఆమె జరీ అంచు తెల్ల చీర కట్టుకున్నది. తెల్ల జాకెట్టు తొడుక్కున్నది. పొడువాటి

జడను మల్లెపూలు కప్పివేసి అందమిస్తున్నాయి. ముఖాన ముక్కు మీదగా, విశాలమైన రెండు కళ్ళ మధ్యగా కల్యాణ తిలకం. బుగ్గన కాటుకచుక్క... చెవులకున్న రవ్వల దుద్దులు ఆమె మెడ కదిలించినప్పుడల్లా అక్కడున్న దీపాల వెలుగులో తళుక్కు మంటున్నాయి

"మీరు వస్తున్నారా?" మెడ వెనక్కు వంచి అన్నది.

"నిన్నొదిలి నేనెక్కడికీ వెళ్ళను... పది గంటల నలభైఆరు నిముషాలనుండి, మన మనస్సులు ఎలా ఒకటి అయినయ్యో, శరీరాలు అలాగే ఒకటి అవ్వాలి!"

"ఛుప్!" మురిపెంగా అన్నది వైదేహి.

"మనమిద్దరమే ఇక్కడ వున్నది... మనం ఎంత పెద్దగా మాట్లాడుకున్నా ఎవ్వరూ వినరు!"

దూరంగా అక్కడక్కడా ఇలాంటి పొదలే.

అది హైదరాబాద్ మహానగరానికి దూరంగా, పట్టంచెరువుకు అవతలగా, బొంబాయి హైవేకు పక్కగా, పాతికెకరాల తోట. తోటనిండా గుబుర్లుగా పెరిగిన వివిధరకాల చెట్లు...

అది పార్టీలకు, ఫంక్షన్‌లకు– డబ్బున పెద్దవాళ్ళకు అతిదగ్గర. చీకటిగదుల్లో బ్లాక్‌మనీ వున్నవాళ్ళకు కారుచౌక!

అక్కడే పెళ్ళిళ్ళు జరుగుతుంటయి. వనభోజనాలు జరుగుతుంటయి. శెలవల్లో వన విహారాలు జరుగుతుంటయి... ప్రేమికులు, కొత్తగా పెళ్ళయినవాళ్లూ, పెళ్ళయి చాలా కాలమయినా మోజు తీరని పడుచువాళ్లూ, జలక్రీడ లాడేటందుకు రెండు అధునాతన స్విమ్మింగ్ పూల్స్ వున్నాయి... ఇక నూతన వధూవరులకు ఆ తోటలో శోభనపు రాత్రులు జీవితాంతం గుర్తుంచుకోతగ్గ ఓ ప్రత్యేక సంబరం!

అక్కడ అన్నీ లభ్యమవుతాయి. ఆ తోటకు ఓ మూలగా కిచెన్ వుంది. వంట వాళ్ళు ఉన్నారు... ఏం కావాలన్నా ముందుగా చెబితే అనుకున్న సమయానికి అమర్చే

సామర్థ్యమున్నది ఆ రిజార్ట్స్ వారికి!

అలా చెట్లమీద కట్టిన గదులు నాలుగున్నాయి. ఎలక్ట్రిసిటీ ఉంది. టెలిఫోన్ సౌకర్యం వున్నది. ఇప్పుడయితే సెల్‌ఫోన్లు రాజ్యమేలుతుండటంతో ల్యాండ్‌ఫోన్ అవసరం అంతగా ఎవరికీ కనబడటం లేదు. ఓ పక్కగా టీపాయ్‌మీద పోర్టబుల్ టీవీ వున్నది.

జయంత్ బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ యింజనీరు. సంవత్సరానికి ఆరు లక్షల జీతం. వైదేహీ లాస్ట్ బ్యాచ్‌లో ఉస్మానియాలో ఎమ్.సి.ఎ చేసింది. ఇంకా ప్రాజెక్ట్ రిపోర్టే తయారుచేయాలి.

జయంత్‌కి, వైదేహికి బీరకాయపీచు చుట్టరికమూ వున్నది.

ఓ బంధువుల ఇంట్లో పెళ్ళికి వెళ్ళినప్పుడు అతడు వైదేహిని చూడటం తటస్థించింది. చూచిన వెంటనే కళ్ళు చెదిరినట్లు అనిపించగా కోలుకోవటానికి అరగంటపట్టింది. తరువాత తన తల్లికి ఆ అమ్మాయిని చూపించి తన ఆసక్తిని వెల్లడించాడు. ఆమె అప్పటికే కోడలి కోసం వేటలో వున్నది.

తల్లి కళ్ళు చికిలించి కొడుకు ముఖంలోకి చూసింది.

"మొదటి చూపులోనే ప్రేమలో పడ్డావా?"

"ప్రేమో, దోమో... అవన్నీ నాకు తెలియదు... ఆమెతో నా ముందు జీవితం ఆనందంగా వుంటుందనిపిస్తోంది!" అన్నాడు మొహమంతా ఎర్రబడగా.

తల్లి ముసిముసిగా నవ్వింది. "కనబడుతూనే వుంది గదా ఆ దోమ కుడితేనే ముఖం ఎర్రబడేది!"

తల్లి మెదడులో విత్తనం నాటాడు కాబట్టి తను ఇంకా తాపత్రయ పడాల్సిందేమీలేదు. ఆమే చూసుకుంటుంది మిగతావన్నీ.

తను మిత్రులతో కలిసి కబుర్లలో పడిపోయాడు ఆ విడిది ఇంట్లో.

జయంత్ తల్లి సరాసరి ఆ అమ్మాయి దగ్గరికే వెళ్ళింది.

"ఇంతకు ముందు చూచిన గుర్తుకు రావటంలేదు... కానీ తెలిసిన వాళ్ళ అమ్మాయి ముఖంలాగానే వున్నది.... నువ్వు ఎవరి అమ్మాయివమ్మా?" అని అడిగింది మాట కలుపుతూ.

జయంత్ చెప్పిన దాంట్లో అబద్ధం లేదు... ఆ అమ్మాయి రంభే!

"నువ్వు వర్ధనమ్మవే అయితే వైదేహి నాకూతురు!" అంటూ ఆ అమ్మాయి తల్లి సంపూర్ణమ్మ ఆ ప్రశ్న వింటూనే వాళ్ళ మధ్యకు వచ్చింది.

రాత్రికి జరగబోయే ఆ పెళ్ళికి ఆ రెండు కుటుంబాలూ ఉదయమే వచ్చినయి.

వాళ్ళ తాతలో, ముత్తాతలో దగ్గర బంధువులు అయివుండవచ్చు... కూర్చొని ఎవరు ఎవరో పీకి లాగితే యిద్దరి చుట్టరికాలూ బయటపడినయి.

వర్ధనమ్మ మాట కలిపింది కాబట్టి ఇక ఆలస్యం చేయలేదు. భర్తను పిలిచింది. కొడుకును పిలిచింది. తాము కనిపెట్టిన చుట్టరికపు చిట్టాను చాపలా పరిచింది వాళ్ళముందు. అటు వైదేహి తండ్రీ వచ్చాడు.

ఓ అరగంటసేపు ఆ విడిదింట్లోనే కబుర్లలో పడిపోయారు పెళ్ళివారు 'భోజనాలు రెడీ' అంటూ మేళ తాళాలతో వచ్చి ఆహ్వానించిందాకా.

జయంత్ తల్లి పుణ్యమా అని వైదేహిని మరింత దగ్గరగా చూచాడు. చిన్నగా మాటలు కలిపాడు. కళ్ళతో నవ్వుతూ తన వివరాలన్నీ చెప్పాడు.

తరువాత నెల తిరక్కుండానే వాళ్ళిద్దరి ఫొటోలతో సహా పెళ్ళి శుభలేఖలు అచ్చయినయి. పెళ్ళి హైదరాబాద్‌లోనే అయింది.

వైదేహి తండ్రి ఓ పెద్ద ప్రైవేటు కంపెనీకి వైస్ ప్రెసిడెంటు. వెనుక తండ్రి ఇచ్చిన ఆస్తే లప్పెడు వున్నది. అటు భార్యా తల్లి దండ్రులకు ఒక్కతే కూతురు అవ్వటంతో మరో లప్పెడు మూటకట్టుకు వచ్చింది. ఇటు జయంత్ తండ్రీ హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ బిజినెస్‌లో దిగి, బాగా సంపాదించి ఆస్తి కూడబెట్టిన వాడే. వాళ్ళకు ఒక్కడే కొడుకు. 'ఒక కూతురు గూడా వుంటే...!' అని అప్పుడప్పుడూ రాత్రి పూట

మంచాల మీద జేరినప్పుడు భర్తముందు భార్య వర్ధనమ్మ నసుగుతుంటుంది గానీ– అది తీరని కోరికే అయింది వాళ్ళకు.

ఆ పూలనిచ్చెన పైమెట్టు దాటి పొదరింట్లో ముందుగా కాలుపెట్టబోతుండగా "ఆగాగు!" అన్నాడు హడావుడిగా జయంత్.

ఎత్తిన కాలును కంగారుగా వెనక్కు తీసుకుంది వైదేహి. జయంత్ నవ్వుతూ, "ఆ కాలుకాదు... కుడికాలు!" అంటూనే ఆమె పక్కగా వచ్చి నిలబడ్డాడు.

"ఇందుకేనా నన్ను కంగారు పెట్టింది!" అని మురిపెంగా నవ్వుతున్న ఆమె చేతిని పట్టుకొని ముందుకు అడుగు వేయబోయాడు.

"ఇంకా పదిహేను నిముషాలుంది. అప్పటిదాకా మనం ఒకళ్ళనొకళ్ళం తాకకూడదు ఈ గదిలో!" అన్నది కొంటెగా అతడి వంక చూస్తూ వైదేహి.

"మీ బామ్మ చెప్పిందా... చెవులో పూలు పెట్టుకొని ఎదురెదురుగ్గా ఊరికినే చూస్తూ కూర్చోమని!"

"అవునట... ఆమెను పొరబాటున మా తాతయ్య అయిదు నిముషాల ముందు ముట్టుకున్నాడట... అందుకే అయిదుగురు పిల్లలు పుట్టారట... పదిహేను నిముషాలకు ముందయితే మనకు పదిహేను..." ఆమె మొహమంతా కందగడ్డలా ఎర్రబడింది.

"ఆపు... ఆపు... స్టాప్... ఆ కాలంలో ప్లానింగ్‌లేక అలా అయిందిలే... ఊరికినే దిగులుపడబోకు... మనకిద్దరు చాలు... మనకు రాజు, మరొకరికి రాణి!" అన్నాడు లోపలకు అడుగుపెడుతూనే ఆమెను గుండెలకు హత్తుకుంటూ.

వైదేహి బలవంతాన జయంత్‌ని విడిపించుకొని దూరంగా జరిగింది.

"పెద్దల మాటను గౌరవించటం నేర్చుకోండి!"

"అందుకే నిన్ను పెద్దవాళ్ళ మధ్య కూర్చోబెట్టి శాస్త్రోక్తంగా పెళ్ళి చేసుకున్నది... లేకపోతే నిన్ను చూసిన వెంటనే, కిడ్నాప్ చేసి తీసుకువెళ్ళి ఏ అడవిలోనో చిన్న గుడిచూసి ఆ మూడు ముళ్ళూ వేసి, ఇంటికి తీసుకు వచ్చి వుండేవాడిని!" అన్నాడు

మురిపెంగా భార్య వైపు అడుగులు వేస్తూ.

"ముందు తలుపెయ్యండి!"

"అబ్బ! ఎంత మంచిమాట చెప్పావమ్మా!" అంటూ వెనక్కు తిరిగి రెండడుగులు వేసి తడికలాంటి తలుపును దగ్గరకు లాగి గొళ్ళెం పెట్టి, దాన్ని ఊపుతూ, "చూసుకో... మళ్ళా ఇంకోసారి నా మూడ్ పాడుచేస్తూ తలుపు గట్టిగా వేశారా లేదా అని అడగవద్దు!" అంటుండగానే ఆ పొదరింటి కప్పుకున్న స్పీకర్‌లోనుంచి చిన్నగా మ్యూజిక్కూ, ఆపైన జలజలా రాలుతున్న మల్లెలు...

ఇద్దరూ ఉక్కిరిబిక్కిరి అయ్యారు.

"వ్వావ్హ్... వ్వావ్హ్... వాట్ ఎ వండర్... డబ్బులు పోతేపోయినయిరా వీళ్ళు మన్ని స్వర్గంలో దించేశారు..." అంటుండగానే ఆ మైక్‌లోనుంచే మ్యూజిక్కు ఆగిపోయి మాటలు వినబడసాగినయి. "మ్యూజిక్ బంద్... మాటలు బంద్... మళ్ళా మేం నోరు తెరిచి మిమ్మల్ని డిస్టర్బ్ చేస్తే ఒట్టు... హావ్ ఎ నైస్ నైట్... సారీ, ఫస్ట్ నైట్ ఇన్ అవర్ రిజార్ట్స్... గుడ్‌నైట్... థాంక్యూ..."

"హమ్మయ్య!" అంటూ ఆమె పక్కన వచ్చి కూర్చున్నాడు జయంత్.

"టైం ఎంతైంది?"

"వెధవ గోల... నేను చేసిన తప్పు చేతికి గడియారం పెట్టుకు రావటం!" అన్నాడు భార్య అందమైన ముఖంలోకి ఆవురావురుమంటూ కళ్ళు చికిలించి చూస్తూ.

వైదేహి నోటికి చేయి అడ్డు పెట్టుకొని పకపకా నవ్వింది. "ఆ గోడకేమున్నదో చూడండి!" అన్నది వేలెత్తి చూపుతూ.

చికాగ్గా తలెత్తాడు జయంత్. అక్కడ గోడగడియారం డిజిటల్ అంకెలతో... పదీ నలభై ఆరు అవ్వాలంటే ఇంకా పదకొండు నిముషాలు ఆగాలి!

'నేను పదీ నలభై ఆరుకు అలారం మోగిస్తాను. అప్పటివరకూ నన్ను తిడుతూ క్షమించేస్తుండండి!' అని దాని క్రింద కంప్యూటర్‌లో తయారు చేసిన ఓ కాగితం

అంటించి వున్నది.

"హతవిధీ! ఇదంతా మీ బామ్మ పనే... రేపు ఇంటికి వెళ్ళగానే దులిపేస్తాను!"

"మూడు రోజులు మనం ఇక్కడనుంచి కదలటం లేదన్నారు గదా... అప్పటికి మీ కోపం తగ్గిపోతుందిలేండి!"

ఫోను గణగణా మ్రోగింది.

"ఇదేంవిటి మధ్యలో... మీ బామ్మేనా?... ఇంకేమైనా జాగ్రత్తలు చెబుతుందా ఏంవిటి ఖర్మ ఇప్పుడు?" అన్నాడు చికాగ్గా.

"చూడండి... ఎవరో!"

"నేను మాత్రం ఫోనెత్తను... మా అమ్మా నాన్నా మనల్ని డిస్టర్బ్ చేసేటంత తెలివి తక్కువ వాళ్ళు కాదు... మీ బామ్మే నీ కోసం చాదస్తం కొద్దీ చేసి వుంటుంది గాని... నువ్వే ఎత్తి చూడు!" అన్నాడు మూతి ముడుచుకుంటూ జయంత్.

వైదేహి లేచింది.

"పది సెకండ్లకంటే ఎక్కువ మాట్లాడావంటే వైర్లు పీకేస్తాను... ఆమె చెప్పిన వెధవ రూల్సుకు నువ్వు బుద్ధూలా తల ఊపుతూ 'ఆఁ ... ఊఁ...' అన్నావంటే గడియారం ముల్లు ముందుకు తిప్పేస్తాను!" అన్నాడు తెచ్చి పెట్టుకున్న కోపంతో వైదేహిని మ్రోగుతున్న ఫోను వైపు నెడుతూ.

వైదేహి ఫోనెత్తి, "హలో!" అన్నది.

"నేను ఈ రిజార్ట్స్ రిసెప్షనిస్ట్‌ను మాట్లాడుతున్నాను... ఒక్కసారి జయంత్‌గారికి ఫోనిస్తారా?" అన్నాడు అవతల వ్యక్తి.

వైదేహి జయంత్ వంక చూసింది వస్తున్న నవ్వును ఆపుకుంటూ– మీ కోసమే నన్నట్లుగా!

జయంత్ చికాగ్గా లేచాడు. లాల్చీ చేతులు పైకి లాక్కున్నాడు విసురుగా.

"ఎవరో అడిగి ఏదో ఒకటి చెప్పి పెట్టేయవచ్చుగదా!" అన్నాడు భార్య చేతిలోని ఫోనును అసహనంగా లాక్కొని చెవిదగ్గర పెట్టుకొని "హలో!" అన్నాడు చిరాగ్గా.

"సారీసర్! మీకోసం మీ బాబాయిగారు వచ్చారు... అర్జంటుగా మీకు ఏదో విషయం పర్సనల్‌గా చెప్పాలిట... మిమ్మల్ని రిసెప్షన్ కౌంటర్ దగ్గరకు ఒక్క నిముషం వచ్చి వెళ్ళమంటున్నారు...!"

"ఫోను వారికివ్వండి!"

"వారు కారులో వున్నారు... డ్రైవర్ వచ్చాడు... రిజార్ట్స్ కారు మీ కాటేజ్ దగ్గరకు వస్తున్నది... క్రిందకు వచ్చేయండి!"

బాబాయ్ తను ఇక్కడకు వచ్చేముందే చెప్పాడు... 'నేను చెన్నయ్ అర్జంటుగా వెళ్ళాలి... ఫ్లయిట్ టిక్కెట్ ఏమైనా దొరుకుతుందేమోనని చూస్తున్నాను... నువ్వు రిజార్ట్స్‌నుంచి తిరిగి వచ్చిందాకా నేను ఉండకపోవచ్చు... నువ్వు ఢిల్లీ నుండి రాగానే ఫోను చేయి' అని. అలా చెప్పిన వాడికి ఇప్పుడే మాట్లాడాల్సిన అంత అర్జంటు పని ఏమొచ్చిందో అర్థం కావటంలేదు.

బాబాయ్ అంటే జయంత్‌కు అమిత గౌరవం. ఆయన మార్గదర్శకత్వంలోనే తను ఇంత వాడయింది. అది ఎంత చికాకు కలిగించే విషయమయినా ఆయన మాటను తను తీసి వేయలేడు.

ఫోను పెట్టేసి, ఒక్క క్షణం గడియారం వంకచూచి, "ఇప్పుడే వస్తాను వైదేహీ... ఒక్క రెండు నిముషాలయినా విరహమనేది ఎంత బాధగా వుంటుందో మనిద్దరం అనుభవించటానికే ఈ అవకాశం వచ్చింది అనుకో... మా బాబాయి అర్జంటుగా చెన్నయ్ వెళ్ళిపోతున్నాడు... నాకేదో చెప్పాలిట... రిసెప్షన్‌లో వున్నాడు... రిజార్ట్స్ వాళ్ళు వారి కారు పంపుతున్నారు... ఆయన చెప్పేదేమిటో విని రెండు నిముషాలల్లో అదే కారులో వచ్చేస్తాను! కంగారు పడబోకు ఒక్కదానివే వున్నానని... నేను బాబాయినే లోపలకు పంపించమంటే ఈ రిజార్ట్స్ లోపలికి కొత్త మనిషిని కాని, బయటవాళ్ళ కార్లని గాని రాత్రి పది దాటితే రానివ్వరట... నేనే వెళ్ళక తప్పదు!" అంటూ హడావుడిగా

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Modati+Ratri**

* * *